# స్కిల్ ఇండియా మిషన్ విఫలం కావటానికే రూపొందిన పథకం

**యువతకు** ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తానంటూ ప్రధాని నరేంద్రమోడీ నైపుణ్యాలను అభివృద్ధిపరిచే పథకంగా పిఎంకెవివై (ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన)ను ప్రకటించాడు. పరిశ్రమల కవసరమైన నైపుణ్యాల కొరవ యువతలో వుండటంవల్ల ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పుకున్నారు. దీని కొరకు ప్రభుత్వం ప్రత్యేకంగా నైపుణ్యాల అభివృద్ధి, వ్యవస్థాపనల మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసింది. ఈ పథకం వల్ల రెండు ప్రయోజనాలుంటాయని, ఒకటి- యువతకు ఉపాధి అవకాశాలు, రెండు పరిశ్రమల కవసరమైన నైపుణ్యాలను అందించటంగా జాతీయ నైపుణ్యాల అభివృద్ధి కౌన్సిల్(ఎన్ఎస్‌డిసి) పేర్కొంది. అది ఎంతవరకు నెరవేరిందన్నదే ఇక్కడ ప్రశ్న.

గత మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమానికి సంబంధించిన సమగ్ర విశ్లేషణగానీ, అది సాధించిందేమి టన్నదిగానీ ప్రస్తావనే లేదు. దీనికి సంబంధించిన మంత్రిత్వశాఖ నైపుణ్యాల మండళ్ళ పనితీరును సమీక్షించేందుకు 'శారదా ప్రసాద్ కమిటీ'ని నియమించింది. 2017 ఏప్రిల్ 15న అది ఒక నివేదికను విడుదల చేసింది. అందులో "శిక్షణ పొందిన వారిలో కేవలం 8.5 శాతం మంది మాత్రమే ఉపాధి పొంద గలుగుతున్నారని ఎన్ఎస్‌డిసి చెబుతున్నది. కానీ ఎంతమంది శిక్షణ పొందారు, ఎంతమంది శిక్షణ పొందుతున్నారన్నది వివరంగా సర్వే చేస్తే తప్ప వాస్తవ పరిస్థితి తెలియదు" అని పేర్కొంది.**(బిజినెస్ స్టాండర్డ్ 2-9-2017)**.

2002 నాటికి 15 కోట్ల మందికి శిక్షణ గరిపే లక్ష్యంతో 2008లో ఎన్ఎస్‌డిసిని ఏర్పాటు చేశారు. దీని గురించి 2015 సాధారణ నివేదికలో 'కాగ్' ఇలా వ్యాఖ్యానించింది: "2010-2011లో ఎన్ఎస్‌డిసి లోని 57శాతం మంది భాగస్తులు లక్ష్యాన్ని చేరుకోవటంలో విఫలమయ్యారు. 2011-2012లో అది 77శాతంగా, 2012-2013లో అది 83 శాతంగా, 2013-2014లో అది 69శాతంగా వుంది. వీరిలో అత్యధికులు శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలను కల్పించలేక పోయారు". ఎన్ఎస్‌డిసి యొక్క నిర్మాణానికి సంబంధించి, కార్యకలాపాలకు సంబంధించి, లక్ష్యాలను సాధించేందు కవసరమైన ఆర్థిక వనరుల గురించి మరోమారు దృష్టి సారించాలని అది ప్రభుత్వానికి సూచించింది.

పిఎంకెవివై పని తీరు ఎలా వుంది? ఇందులో రెండు విభాగాలున్నాయి. ఒకటి ముందే శిక్షణ పొందిన వారిని గుర్తించటం(ఆర్‌పిఎల్). ఇందులో అప్పటికే ఉపాధి అవకాశాలనందుకున్న వారికి తక్కువ వ్యవధిలో శిక్షణగరపటానికి కొత్త వారిని ఎంపిక చేయటం. 2015 జులైలో 2 కోట్ల 40 లక్షల మందికి శిక్షణనివ్వటానికి మోడీ ప్రభుత్వం 1500 కోట్ల రూపాయలను కేటాయించింది. ఇందులో ఒక కోటి నలభై లక్షలమంది కొత్తవారు కాగా, మిగిలిన వారు ఆర్‌పిఎల్ కిందకు వస్తారు. కాగా, ఒక కోటి 80 లక్షల మందికి ఈ పథకంలో భాగంగా శిక్షణ అందించగా, వారిలో ఒక కోటి 20 లక్షలమంది శిక్షణ పొందినట్లు సర్టిఫికెట్లు పొందారని తేల్చారు.

పిఎంకెవివై రెండవ దశలో 2020నాటికి ఒక కోటి మంది యువతకు నైపుణ్యాలను అభివృద్ధిచేసే లక్ష్యంతో 12000 కోట్లరూపాయలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. లభిస్తున్న సమాచారం ప్రకారం 2016- 17 సంవత్సరానికి ఎన్ఎస్‌డిసిలో స్వల్పవ్యవధి శిక్షణ కోసం నమోదు అయినవారు 9,13,811 మంది. వారిలో 6,02,552 మంది శిక్షణ పొందగా, 4,16,711 మంది సర్టిఫికెట్లు పొందారు. కానీ కేవలం 72,858 మందికి మాత్రమే ఉద్యోగావకాశాలు లభించాయి. ఆర్‌పిఎల్ కింద 4,27,026 మంది నమోదు కాగా, వారిలో 4,13,917 మంది శిక్షణ పొందారు. నాలుగు సంవత్సరాలలో కోటి మందికి శిక్షణ గరపుతామనే ఆర్భాటపు లక్ష్యానికి ఏమాత్రం చేరువలో లేమని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. పైగా దీనికి సంబంధించిన అన్ని పార్శ్వాల సమగ్ర విశ్లేషణ లేకుండా కేవలం ఈ అంకెల ఆధారంగా మాత్రమే ఒక నిర్ధారణకు వచ్చే అవకాశంలేదు.

ఈ పథకానికి సంబంధించిన వివిధ భాగస్వాములతో సంప్రదించిన అనంతరం శారదా ప్రసాద్ కమిటి ఈ విధంగా చెప్పింది: "అందరూ ఒకటే చెబుతున్నారు. ఆయా రంగాలకు అవసరం లేకున్నా నిర్దేశించిన లక్ష్యాలు మాత్రం చాలా ఎక్కువగా వున్నాయి. అందరికీ అంకెలే కావాలి. యువతకు ఉపాధి కల్పించటం కానీ, వివిధ రంగాల అవసరాలను తీర్చటంగానీ కాకుండా ఒక్కొక్కళ్ళు ఎంతమందికి శిక్షణ ఇచ్చారనే అంకెల వేపు పరిగెడుతున్నారు".

2008లో ప్రారంభించబడిన ఈ ఎన్ఎస్‌డిసి పథకం 2022 నాటికి 14 సంవత్సరాలలో 15 కోట్ల మందిని శిక్షితులుగా చేయాలని సంకల్పించింది. 9 సంవత్సరాల తర్వాత 2017 సెప్టెంబరు 1 నాటికి కేవలం 6 లక్షలమంది యువతకు మాత్రమే శిక్షణ నీయగల్గింది. అంటే కనీసం పదిలక్షలమందికి కూడా శిక్షణ నివ్వలేక ఘోరవైఫల్యాన్ని చవిచూసింది.

ఆ శిక్షణ కూడా దాని లక్ష్యాన్ని సాధించలేక పోయింది. శిక్షణ పొందిన వారిలో కేవలం 8.5 శాతంమంది మాత్రమే ఉద్యోగావకాశాలు పొంద గల్గారు. వివిధ రంగాలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించటంలో, అర్థంచేసుకోవటంలో ఈ పథకపు రూపకర్తలు చాలా ఉదాశీనంగా వున్నారు. వారిచ్చే శిక్షణ పరిశ్రమలకు ఉపయోగపడుతుందా లేదా అన్నది పరిగణలోకి తీసుకోకుండానే వారు యువతకు శిక్షణా కార్యక్రమాన్ని కొనసాగించారు.

ఈ పథకపు రూపకల్పనలోనే వైఫల్యముంద నటంలో అర్థం – అది నిర్దేశిత లక్ష్యాలను చేరుకోక పోవటంవలనే కాదు; ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు సమృద్ధి అవుతాయనే భ్రమలను యువతలో పెంపొందిచటం ప్రభుత్వం యొక్క ఉద్దేశం. అందుకే ఇది విఫల మవటానికే రూపొందించబడిన పథకం.

దీనికన్నా ముఖ్యంగా విద్యారంగంలో మరిన్ని సంస్కరణలను అమలుజరిపేందుకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించటం ప్రభుత్వంయొక్క ఉద్దేశ్యం. ప్రస్తుత విద్యావిధానం నైపుణ్యాలను పెంచటంలో విఫలమైన ఫలితంగా నిరుద్యోగం ప్రబలిందని చెప్పటం పిఎంకెవివై ఉద్దేశ్యం. విద్యారంగ సంస్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కల్గించటానికి అది పూనుకుంది. అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాలను నెరవేర్చే విధేయులైన శ్రామికులను సమకూర్చటమే విద్యారంగ సంస్కరణల ముఖ్య ఉద్దేశ్యం. ప్రాథమిక విద్యనుండి ఉన్నత విద్య వరకు ప్రైవేటీకరించటంద్వారా సామాజిక బాధ్యత, జాతి నిర్మాణం, అభివృద్ధి, పౌరశిక్షణలనుండి విద్యను మరల్చి కేవలం ఉద్యోగాలకు పరిమితం చేయటమనే అంశం ఇమిడి వుంది. ఈ విధానాల పరిణామాలు మన దేశానికి, ప్రజలకు ప్రమాదకరమైనవి.

ooooo